క్లుప్తంగా

రీసర్వే వేగవంతం చేయాలి

నకరికల్లు: రీసర్వే పనులను తప్పులతడకలు లేకుండా వేగవంతంగా పూర్తిచేయాలని తహసీల్దార్ కె.నగేష్ ఆదేశించారు. మండలంలో చేపడుతున్న రీసర్వే పనులపై గురువారం సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశల వారీగా చేపడుతున్న రీసర్వే పురోగతి ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని అన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ



క్రోసూరు: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.58 వేలు విలువ చేసే సౌండ్ సిస్టంను పూర్వ విద్యార్థులు గురువారం అందజేశారు. 1976– 1981 సంవత్సరం బ్యాచ్ పూర్వ విద్యార్థులు సాయం అందించడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.రామాంజనేయులు అన్నారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు సి.హెచ్.సురేష్ బాబు పాల్గొన్నారు.

23 నుంచి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

సత్తెనపల్లి: గుర్రం జాషువా 128వ జయంతి సందర్భంగా కవి కోకిల శ్రీ గుర్రం జాషువా సాహితీ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 23, 25న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు కవి కోకిల గుర్రం జాషువా సాహితీ సేవా సంస్థ కమిటీ అధ్యక్షుడు పీ యిరీమ్మియా, కార్యదర్శి జి.సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్రగతి ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 23న మధ్యాహ్నం 2 గంట నుంచి 3.30 గంటల వరకు 9వ తరగతి, 10వ తరగతి విద్యార్థులకు గబ్బిలం ఇతివృత్తం జాషువా దృక్పథం అనే అంశంపై, ఈ నెల 25న మధ్యాహ్నం 2 గంటల నుంచి 3.30 గంటల వరకు ఇంటర్మీడియెట్ విద్యార్థులకు జాషువా పద్యాలు విశిష్టత అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించనున్నట్లు పర్కొన్నారు. విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

అచ్చంపేట: స్థానిక ఎస్సీ, ఎస్టీ కాలనీలలో పంచాయతీ కార్మికులు, పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు పర్యవేక్షణలో గురువారం పారిశుధ్య పనులు చేపట్టారు. సైడు కాలువలలో పూడిక తీసి, వాడుక నీరు పోయే విధంగా శుభ్రం చేశారు. మురుగు చేరిన ప్రాంతాలలో దోమలు చేరకుండా బ్లీచింగ్ చల్లారు.

కోర్కెల సాధన యూటీఎఫ్‌కే సాధ్యం

అచ్చంపేట: న్యాయమైన కోర్కెల సాధన యూటీఎఫ్(ఐక్య ఉపాధ్యాయ సంఘం)కే సాధ్యపడుతుందని, ఉపాధ్యాయులంతా సంఘంలో సభ్యత్వం పొందాలని ఆ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు, ఎ.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని మాదిపాడు, చల్లగరిగ, తాడువాయి, చెరుకుంపాలెం, కొత్తపల్లి గ్రామాలలోని జిల్లా పరిషత్, మండల పారిషత్ పాఠశాలలో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ప్రకాశరావు, గౌరవాధ్యక్షులు శౌరెడ్డి, సహ అధ్యక్షులు సత్యనారాయణ, జిల్లా కౌన్సిల్ పూర్ణచంద్రరావు, కె.వెంకటేశ్వరరావు, నిర్మల కుమారి, బాషా పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

అమరావతి: గ్రామీణ ప్రాంతాలలోని మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జన చైతన్య సమితి ప్రోగ్రాం కో ఆర్డినేటర్ వి.అనిల్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నెహ్రూ యువ కేంద్ర అనుబంధ సంస్థ అయిన జన చైతన్య సమితి ఆధ్వర్యంలో అమరావతిలోని శ్రీనివాస్ థియేటర్ సమీపంలోని శిక్షణాభివృద్ధి కేంద్రంలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల లోపు వయసు కలిగిన వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. వివరాలకు 8886777767, 9492 27 1417 సంప్రదించాలని కోరారు.

సరస్వతి శిశుమందిరానికి విరాళం

అమరావతి: స్థానిక శ్రీసరస్వతీ శిశుమందిర్ అభివృద్ధికి మండల పరిధిలోని ధరణికోటకు చెందిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి కాకాని జనార్ధనరావు రూ.50 వేలు గురువారం అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం కోలా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన సదస్సు

పిడుగురాళ్లరూరల్: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ పథకం ద్వారా గ్రామాలు ఆదర్శంగా తీర్చిదిద్దబడతాయని మండల కో ఆర్డినేటర్ ఇనుముక్కల పిచ్చయ్య అన్నారు. మండలంలోని చెన్నాయిపాలెం గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ 2023 పథకంపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలోని ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత కలిగి ఉండాలన్నారు.

రాష్ట్రం సుభిక్షంగా కళకళలాడాలి

- మంత్రి అంబటి రాంబాబు
- నియోజకవర్గంలో మదిమదిలో బొజ్జ గణపయ్య



పట్టణంలోని 22వ వార్డు వినాయక మండపంలో మంత్రి అంబటి రాంబాబు



పట్టణంలోని 23వ వార్డులో వినాయకుడి పూజల్లో చల్లంచర్ల, నాయకులు



పట్టణంలోని కోటమ్మసత్రం వద్ద లక్ష్మీ గణపతి సహిత రుద్ర చండీహోమంలో భక్తులు

సత్తెనపల్లి: పట్టణంలోని వార్డుల్లో, మండలాల్లోని ఊరూరా వినాయక నామస్మరణతో మారు మ్రోగుతోంది. నియోజకవర్గంలోని గల్లీ గల్లీ ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. మదిమదిలో విఘ్నేశ్వరుడే. గణపతి నవరాత్రులు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. నాలుగో రోజైన గురువారం భక్తులు మండపాలకు వెళ్లి బొజ్జ గణపయ్యకు ప్రత్యేక పూజలు చేశారు. తీర్థప్రసాదాలు స్వీకరించి తరించిపోయారు. సాంస్కృతిక కార్యక్రమాలు జోరందుకున్నాయి. కాగా కొన్ని వార్డుల్లో, గ్రామాల్లో గణపతి విగ్రహాల నిమజ్జనాలు సైతం జరిగాయి. యువకులు భారీ విగ్రహాలను వాహనాలపై తరలిస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నసంతర్పణలు చేపట్టారు.

పట్టణంలోని 22వ వార్డులో శెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సందర్శించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ విఘ్నేశ్వ రుడిని భక్తులు భక్తిశ్రద్ధలతో పూజిస్తున్నారన్నారు. రాష్ట్రం అంతటా సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలతో రాష్ట్ర కళకళలాడాలని, ప్రజలు అంతా సుఖ సంతోషా లతో ఉండాలని ఆకాంక్షించారు. మంత్రి అంబటి రాంబాబును శెట్టి శ్రీనివాసరావు సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమ రావు, కౌన్సిలర్లు అచ్యుత శివప్రసాద్, శెట్టి ఆనంద్, ఆకుల రమేష్‌బాబు, నాయకులు సాని కొమ్ము అంజిరెడ్డి పాల్గొన్నారు. అలాగే 23వ వార్డులో అన్న సంతర్పణను చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివ రావు పూజలు నిర్వహించి ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆకుల రమేష్‌బాబు, నాయకులు షేక్ గని, వల్లెం నరసింహరావు, శిరిగిరి వెంకట్రావు, సంకుల తిరుపతిరావు పాల్గొన్నారు. పట్టణంలోని అచ్చంపేట రోడ్డులోని కోటమ్మసత్రం వద్ద లక్ష్మీ గణపతి సహిత రుద్రచండీహోమం వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్ మండపాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. అన్నసంతర్పణను ప్రారంభించారు. పట్టణంలోని రఘురామ్ నగర్‌లోని పృధ్వీగార్డీనియా అపార్ట్‌మెంట్ వద్ద కమిటీ ప్రెసిడెంట్ చల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వినాయక మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మెడికోకు స్నేహహస్తాలు వితరణ



విద్యార్థినికి లక్ష రూపాయల చెక్కు అందజేస్తున్న మధుసూదనరావు

అచ్చంపేట: మెడిసిన్‌లో ఫ్రీ సీటు సాధించిన నిరుపేద విద్యార్థికి స్నేహహస్తాలు ఫౌండేషన్ హాస్టల్ ఫీజు నిమిత్తం లక్ష రూపాయల చెక్కును స్థానిక వైద్యులు మామిళ్లపల్లి మధుసూదనరావు చేతులమీదుగా గురువారం అందజేశారు. అమరావతికి చెందిన షేక్ ఇస్రాన్, నీట్ పరీక్షలో 509 మార్కులతో విజయనగరం జిల్లాలోని మహారాజా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కాలేజీలో ఫ్రీ సీటు సాధించి మొదటి సంవత్సరం ఎంబీబీఎస్‌లో ప్రవేశించింది. ఫ్రీ సీటు సాధించిన ఇస్రాన్ తల్లిదండ్రులకు కనీసం హాస్టల్ ఫీజు కూడా చెల్లించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో స్నేహ హస్తాలు ఫౌండేషన్ వారిని ఆశ్రయించారు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు తాము ఎప్పుడు అండగా ఉంటామంటూ అడిగిన వెంటనే స్నేహహస్తాలు ఫౌండేషన్ స్పందించి హాస్టల్‌కు చెల్లించాల్సిన లక్ష రూపాయలు ఇచ్చేందుకు ముందుకొచ్చింది. ఈ సందర్భంగా డాక్టర్ మధుసూదనరావు మాట్లాడుతూ ప్రతిభ ఉన్న విద్యార్థులకు స్నేహహస్తాలు అండగా ఉండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్నేహహస్తాలు కో ఆర్డినేటర్ తాయి కరిముల్లాబాబు, చెరుకుంపాలెం గ్రామాభివృద్ధి సంస్థ అధ్యక్షులు తుమ్మా శారెడ్డి పాల్గొన్నారు.

గురజాడ అప్పారావుకు ఘన నివాళి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు

క్రోసూరు: స్థానిక సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో గురజాడ అప్పారావు జయంతి గురువారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ మేరీ రజిత గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఉపాధ్యాయుడు కిరణ్ పాల్గొన్నారు.

75త్యాళ్లూరులో..

అమరావతి: సంఘసంస్కర్త, మహాకవి గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా గురువారం మండల పరిధిలోని 75త్యాళ్ళూరు జెడ్పీ హైస్కూల్, పెదకూరపాడు జెడ్పీ హైస్కూల్లో ఆయన చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, కేవీ రమణ పాల్గొన్నారు.

ఐకాన్–2023 అవార్డుకు శ్రీనివాసరెడ్డి ఎంపిక మండల పరిధిలోని 75త్యాళ్లూరు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎ.శ్రీనివాసరెడ్డి ఐకాన్–2023 అవార్డుకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌కు చెందిన సాయి అలేఖ్య సాంస్కృతిక సేవాసమితి అవార్డును ప్రకటించింది. ఈనెల 23న హైదరాబాద్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో అవార్డు అందుకోనున్నారు.

నెలాఖరులోగా ఈ క్రాప్ బుకింగ్



ఆర్‌బీకేలో రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ యలమందారెడ్డి

కారెంపూడి: ఈ నెలాఖరు లోపు ఈ క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలని అలాగే వైఎస్సార్, పీఎం కిసాన్ లబ్ధిదారులైన రైతుల ఈకేవైసీలు కూడా పూర్తి చేయాలని మండల వ్యవసాయశాఖ అధికారి బి.యలమందారెడ్డి మండలంలోని వ్యవసాయశాఖ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని చినగార్లపాడు గ్రామ రైతు భరోసా కేంద్రాన్ని ఏఓ గురువారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి ఈకేవైసీ నమోదు 22 శాతం మాత్రమే చేశారని మిగిలింది త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే 80 శాతం ఈ క్రాప్ బుకింగ్ పూర్తయ్యిందని మిగతా 20 శాతం కూడా పూర్తి చేయాలని కోరారు. పంట నష్టం జరిగినప్పుడు ఇన్సూరెన్స్ వర్తించడానికి అలాగే పంటలను గిట్టుబాటు ధరకు ప్రభుత్వానికి అమ్ముకోవాలన్నా ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరని ప్రతి రైతు గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

విలువలతో కూడిన విద్యనందించాలి

దాచేపల్లి : విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అందించాలని ఎంఈవో పినాకపాణి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ మెయిన్ పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చదువుకునేందుకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించిందని, విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేలా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని ఎంఈవో ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలకు సక్రమంగా హాజరుకాని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని, తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఈవో వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

పోలింగ్ బూత్‌ల మార్పు ఆలోచన లేదు



రాజుపాలెం: పోలింగ్ బూత్‌లు మార్పు చేయవద్దని మహిళలు ఆర్డీఓ రాజకుమారికి విన్నవించారు. మండలంలోని ఇనిమెట్లలో 164(జెడ్పీ పాఠశాల), 165(ఉర్దూ పాఠశాల) పోలింగ్ బూత్‌లను సత్తెనపల్లి ఆర్డీఓ ఆర్ఎల్ రాజకుమారి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ ఆ పోలింగ్ బూత్‌లలో ఉన్న ఓటర్లను విచారించారు. ఎక్కడి బూత్‌లు అక్కడే ఉంచాలని, అందరికీ అనుకూలంగా ఉన్నాయని స్థానికులు ఆర్డీఓకు వివరించారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఆమె వెంట తహసీల్దారు ఏ బేగం ఉన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

అమరావతి: మండల పరిధిలోని వివిధ గ్రామాలలోని తొమ్మిది పోలింగ్ బూత్‌లను ఈఆర్ఓ ఎన్.రామచంద్రరావు గురువారం పరిశీలించారు. మండల పరిధిలోని అత్తలూరు, దిడుగు, అమరావతి, ఎనికపాడు గ్రామాలలోని తొమ్మిది పోలింగ్ బూత్‌లను తనిఖీ చేశారు. ఈబూత్‌లను వేరేచోటికి మార్చాలనే దరఖాస్తులు రావటంతో విచారణ చేపట్టారు.

ఎరువులు మద్దతు ధరకే అమ్మాలి



దమ్మాలపాడు(ముప్పాళ్ల): ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరకే ఎరువులు అమ్మకాలు జరపాలని, అధిక ధరలకు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ హెచ్చరించారు. మండలంలోని దమ్మాలపాడు, తొండపి గ్రామాల్లోని సహకార సంఘాల గోదాములను గురువారం తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా నిల్వను, ఆ మేర రిజిస్టార్లను పరిశీలించారు. ధరల పట్టికను అందరికీ కనిపించేలా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎరువులు కూడా అవసరం మేరే రైతుకు అమ్మకం జరపాలని, అక్రమ నిల్వలు ప్రోత్సహించకుండా చూసుకోవాలన్నారు. ప్రతి రైతుకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని కోరారు.

రైతులకు నాణ్యమైన ఎరువులను అందించాలి

పిడుగురాళ్లరూరల్: రైతులకు నాణ్యమైన ఎరువులను అందించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్. శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి, గుత్తికొండ తదితర గ్రామాల్లో ఎరువుల దుకాణాలలో ఆయన తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా స్టాక్ రిజిస్టర్, బిల్లు పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎరువులు అధిక ధరలకు అమ్మినట్లు అయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతం చేయాలి

డెప్యూటీ డీఎంహెచ్ఓ చంద్రశేఖర్



యాప్‌లను పరిశీలిస్తున్న డెప్యూటీ డీఎంహెచ్ఓ చంద్రశేఖర్

క్రోసూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది విజయవంతం చేయాలని పల్నాడు జిల్లా డెప్యూటీ డీఎంహెచ్ఓ గుడిసె చంద్రశేఖర్ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు, సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు అమలు తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. క్రోసూరులో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సర్వేను పరిశీలించారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలకు పలు సూచనలు, సలహాలు చేశారు. యాప్‌లో అప్లోడ్ తీరును పరిశీలించారు. అనంతరం గరికపాడు సచివాలయంలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. గరికపాడులో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి యాప్‌లను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని, ఇందులో భాగంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తుందని చెప్పారు. ఆరోగ్య సమస్యలకు సంబంధించి ప్రతి ఇంటిని ప్రతి వ్యక్తిని కలిసి ఆరోగ్య వివరాలు తెలుసుకోవాలని కోరారు. సెప్టెంబర్ 30వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నలుగురు వైద్యులు పాల్గొంటారని తెలిపారు. ఇందులో ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులు ఉంటారన్నారు. వలంటీర్లు రెండు సార్లు ఇంటింటి క్యాంపెన్ చేయాలని చెప్పారు. ఆరోగ్య కార్యకర్తలు, సిహెచ్ఓలు ఇంటింటికి వెళ్లి ఆరోగ్యశ్రీ యాప్‌ను ఫోన్లో డౌన్లోడ్ చేయించాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం, 104, 108, ఆరోగ్యశ్రీ సేవలు తదితర అన్ని రకాల అంశాలపై ఇంటింటి క్యాంపెయిన్ చేపట్టాలన్నారు. అండర్ వెయిట్ అనీమియా గర్భిణులను గుర్తించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల సత్తా



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో హెచ్ఎం మాధవీలత, పీడీ సునీత, పీఈటీ శాస్త్రి

సత్తెనపల్లి: క్రమం తప్పకుండా తర్ఫీదు పొందుతూ రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో సత్తా చాటాలని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జువ్వా మాధవీలత అన్నారు. చెరుజమ్ముల పాలెంలో ఈనెల 20న నిర్వహించిన ఎస్‌జీఎఫ్ గుంటూరు, పల్నాడు జిల్లాల స్థాయి హాకీ అండర్–14 విభాగంలో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు దరువూరి హరిప్రియ, శెగ్గం అక్షయ, కిస్తపాటి దుర్గా రూపశ్రీ, అండర్ –17లో అంక్కెం మాధురి, షేక్ జస్మాపర్విన్, మల్లా శ్రీలక్ష్మీ మహేశ్వరి ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో గురువారం పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో పీడీలు కాకుమాను సునీత, శివ గోవర్ధన, పీఈటీ పీఎస్ఆర్ శాస్త్రి పాల్గొన్నారు.

విద్యకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యం



మాట్లాడుతున్న బత్తుల పద్మావతి వేదికపై ఎంపీపీ పద్మా వెంకటేశ్వరరెడ్డి

మాదల(ముప్పాళ్ల): ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు, సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ చైల్డ్ రైట్స్ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి పేర్కొన్నారు. స్థానిక మహాత్మాజ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలను గురువారం తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఎంచుకొని ఆ దిశగా రాణించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలతో పాటుగా, హాస్టల్‌లో ఉండే వారికి నాణ్యమైన ఆహారంతో, పౌష్టికాహారం అందించటం జరుగుతుందని చెప్పారు. విద్యార్థినులకు హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. తొలుత పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. వంట గది, వండిన ఆహారాన్ని, కోడిగుడ్లను పరిశీలించారు. నాణ్యతతో కూడిన కూరగాయలు, నిత్యావసరాలు అందించాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను కోరారు. ఆమె వెంట ఐసీడీఎస్ సీడీపీఓ స్వర్ణకుమారి, పాఠశాల ప్రిన్సిపాల్ మిరియాల వెంకటేశ్వర్లు ఉన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన ఉండాలి

బెల్లంకొండ: బాల్య వివాహాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి పేర్కొన్నారు. మండలం కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామ సర్పంచులు, ఎంపీపీటీసీలు, ఐసీడీఎస్, వైద్య, ఆరోగ్య, పంచాయతీ, పోలీస్, విద్యా శాఖ అధికారుల సమావేశం గురువారం నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకూ జరిగిన బాల్య వివాహాలు, అధికారులు తీసుకున్న చర్యలపై అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎంపీపీ పద్మా వెంకటేశ్వర రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గాదె వెంకటరెడ్డి, సీడీపీఓలు స్వర్ణకుమారి, శాంతకుమారి, ఎంపీడీఓ వెంకటరెడ్డి, ఎంఈఓ బాల సుందరరావు, ఎస్ఐ కె.అమీర్, పీహెచ్‌సీ డాక్టర్ కోటేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పరిమళ, వనజ, మున్నీ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

రాజుపాలెం: రుచికరమైన, శుభ్రమైన భోజనాన్ని బాలికలకు అందించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిటీ మెంబర్ బత్తుల పద్మావతి తెలిపారు. మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వంటశాలను పరిశీలించి శుభ్రత గురించి వివరించారు. విద్యార్థులతో సమావేశమై వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు.విద్యార్థుల నుంచి మంచి స్పందన రావడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు ఏ.బేగం, ప్రిన్సిపాల్ జోతిర్మయి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమాదేవి పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న ఎస్ఈబీ అధికారులు


పిడుగురాళ్ల: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ సీఐ ఎస్.కొండారెడ్డి తెలిపారు. పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ నుంచి దిగుతుండగా పిడుగురాళ్ల మండలం జూలకల్లు గ్రామానికి చెందిన బి.ఫణీంద్ర రెండు కర్రల సంచులు తీసుకొని అనుమానాస్పదంగా కనిపించటంతో తనిఖీలు నిర్వహించామని తెలియజేశారు. ఫణీంద్ర తీసుకొని వచ్చిన సంచుల్లో 750 మిల్లీ లీటర్లు మాన్సనాస్ సీసాలు 36, 375 మిల్లీ లీటర్ల మాన్సనాస్ సీసాలు 18 తెలంగాణ నుంచి తీసుకొని వస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకోవటం జరిగిందని తెలిపారు. అనంతరం ఫణీంద్రపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయటం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భవ సద్వినియోగం చేసుకోండి

మాచర్ల: ప్రతి పౌరుడి ఆరోగ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో చేపట్టిన ఆయుష్మాన్ భవ ప్రత్యేక ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వాసుపత్రుల వర్కింగ్ చైర్మన్ డాక్టర్ రామకోటయ్య, మాచర్ల ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఉదయభాను సూచించారు. గురువారం ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యమేళా శిబిరాన్ని ప్రభుత్వాసుపత్రిలో నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణి, ప్రసవ, చిన్నపిల్లల వైద్యులు శస్త్రచికిత్స, చెవి, ముక్కు, గొంతు ఆరోగ్యానికి సంబంధించిన వైద్యులు 400ల మందిని పరిశీలించి చికిత్స చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల స్పెషలిస్టు వైద్యులతో పాటు డాక్టర్ జయప్రకాష్, జ్యోతి, దినేష్, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కబడ్డీ, వాలీబాల్ జట్లకు అండర్- 14, అండర్ 17 విభాగాలలో ఎంపికైన బాలికలు



బాలుర జట్లు..

పెదకూరపాడు నియోజకవర్గ స్థాయి క్రీడా జట్లు ఎంపిక

అచ్చంపేట: పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలులో నియోజకవర్గ స్థాయి కబడ్డీ, వాలీబాల్ క్రీడా జట్ల ఎంపికలు గురువారం నిర్వహించారు. నియోజకవర్గంలోని అచ్చంపేట, అమరావతి, క్రోసూరు, పెదకూరపాడు, బెల్లంకొండ మండలాలలోని 30 జెడ్పీ పాఠశాలల నుంచి సుమారు 300 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. పాఠశాల పీడీ ఆలపాటి సుజాత మాట్లాడుతూ అండర్–14, 17 కబడ్డీ, వాలీబాల్‌లో బాలుర, బాలికలకు వేర్వేరుగా ఎంపికలు జరిగాయన్నారు. ఎంపికైన టీంలు జిల్లా స్థాయిలో జరిగే ఎంపికలలో పాల్గొంటారని చెప్పారు. ప్రతిభ కనబరచినవారిని రాష్ట్రా జట్టుకు ఎంపిక చేస్తామని చెప్పారు. ఎంఈఓ నరసింహారావు, పాఠశాల హెచ్ఎం సీహెచ్ కల్యాణి ప్రారంభించారు. అచ్చంపేట, క్రోసూరు, అమరావతి మండలాల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్స్ సత్యనారాయణ, శ్రీధర్, అనూరాధ పాల్గొన్నారు.